క్లుప్తంగా

మంత్రి పొన్నంను కలిసిన నాయకులు



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శనివారం చిగురుమామిడిలో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని సమస్యలను మంత్రికి వివరించారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని వినతిపత్రం అందించారు. అనంతరం నిధుల మంజూరుకు కృషిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి పందిర్ల లింగం గౌడ్, నాయకులు రాంరెడ్డి, రాములు, చెన్ని బాబు, దేవయ్య, మల్లారెడ్డి తదితరులున్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం అందజేత



పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీడీవోలు

సిరిసిల్ల: జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణను శనివారం జిల్లా ఎంపీడీవోల అసోసియేషన్ ప్రతినిధులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీ క్యాంపు కార్యాలయంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, ఎంపీడీవోల సంఘంజిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ఎంపీడీవోలు రమేశ్, శంకర్‌నాయక్, లచ్చాలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ఇల్లంతకుంట మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని రేపాక, సోమారంపేట, వెంకట్రావుపల్లె, అనంతగిరి గ్రామాల్లో అభయహస్తం గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. రేపాకలో మండల పరిషత్ నిధులతో నిర్మించిన హైమాస్ట్ లైట్లు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. వెంకట్రావులపల్లెలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం అనంతగిరి పోచమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ వుట్కూరి వెంకట రమణ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చందాల పేరుతో వచ్చేవారిని నమ్మొద్దు

బోయినపల్లి(చొప్పదండి): అనాథాశ్రమం పేరుతో చందాలు ఇవ్వాలని గుర్తు తెలియని అడిగితే నమ్మవద్దని ఎస్సై మామిడి మహేందర్ శనివారం పేర్కొన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో 'అనాథాశ్రమం పేరుతో చందాల వసూలు' అనే శీర్షికన శనివారం కథనం ప్రచురితమైంది. దీనిపై పోలీస్ ఉన్నతాధికారులు స్పందించినట్లు సమాచారం. ఈ మేరకు ఎస్సై మహేందర్ గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు చందాలు కావాలని అడిగితే మోసపోవద్దన్నారు. అలాంటి వారిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక నాయకులు సీ.రామరాజుతో మాట్లాడి ఎస్సై వివరాలు తెలుసుకున్నారు.

చీటింగ్ కేసు నమోదు

సిరిసిల్లక్రైం: ఎన్నికల సమయంలో ప్రచారం చేస్తే డబ్బులు ఇస్తానని మోసం చేసిన ప్రజాప్రతినిధితో పాటు మరికొందరిపై సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన లగిశెట్టి శ్రీనివాస్ తన ప్రచారంలో భాగంగా మిట్టపల్లి శ్రీకాంత్ సేవలను వినియోగించుకుని డబ్బులు ఇస్తానని నమ్మబలికాడు. అనంతరం డబ్బులు ఇవ్వకపోవడంతో శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు లగిశెట్టి శ్రీనివాస్, గుంటుక మహేశ్, ఏలూరి రవికిరణ్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

అత్తారింటిపై..

అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న అత్తారింటిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. పట్టణానికి చెందిన గాజుల నవ్యను ఆమె భర్త మల్లేశం అత్త గాజుల నీలమ్మ ఆడబిడ్డలు బండారి భారతి, గెంట్యాల మంజుల, బండారి శ్రీకాంత్, గెంట్యాల శ్రీనివాస్ వేధింపులకు గురిచేస్తూ అదనంగా మరో రూ.2లక్షలు తీసుకురావాలని ఒత్తిడి చేసినట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తులపై..

సిరిసిల్లక్రైం: తనకు ఇవ్వాల్సిన డబ్బును అడిగిన వ్యక్తిని చంపేందుకు యత్నించిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. పట్టణంలోని సంజీవయ్య నగర్‌కు చెందిన రాగుల రాములుకు ర్యాకం భానుచందర్ రూ. 8 లక్షలు ఇవ్వాల్సి ఉంది. డబ్బులు ఇవ్వాలని అడిగినందుకు భానుచందర్, ర్యాకం మనోహర్ రాములు ఇంటికి వెళ్లి తిట్టడంతో పాటు కొడవలితో చంపేందుకు యత్నించడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గరం గరంగా వెరైటీ సూప్స్

- తేలికగా..జీర్ణమయ్యే ప్రోటీన్ పదార్థం
- వేడివేడిగా..సూప్స్‌ను ఆస్వాదిస్తున్న జనం
- ఫాస్ట్‌ఫుడ్, హోటళ్లలో తయారు..

సూప్స్ మెనూ..	రూ.
టొమాటో:	80
వెజ్ మాంచో	90
వెజ్ హాట్ అండ్ సూర్	90
వెజ్‌కార్న్	70
హాట్‌గార్లిక్	70
క్రీమ్ ఆఫ్ మష్రూమ్	90
లెమన్ కోరియండర్	70
చికెన్ స్వీట్‌కార్న్	130
చికెన్ మాంచో	140
చికెన్ హాట్ అండ్ సూర్	130
చికెన్ క్లియర్	110
చికెన్ లెమన్ కోరియండర్	130





సిరిసిల్లటౌన్: చలిని తట్టుకునేందుకు, తినగానే తేలికగా జీర్ణమయ్యే పదార్థాలను ఆస్వాదించాలనుకుంటున్నారు పట్టణ ప్రజలు. ఇందుకు తగ్గట్టుగా విభిన్న రుచుల్లో వెరైటీ సూప్స్ తయారుచేస్తున్నాయి. నగరాల్లోనే లభించే వెరైటీ రుచుల సూప్స్ ఇప్పుడు సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోనూ లభిస్తున్నాయి. చల్లని చలిలో చూడగానే నోరూరించే హాట్..హాట్ సూప్స్‌పై ఈవారం సండేస్పెషల్ స్టోరీ..

ఆటోస్టే...వేరు..

అప్పటికప్పుడు పొయ్యిమీది నుంచి తీసిన వేడివేడిగా పొగలు కక్కే సూప్స్ ఆస్వాదిస్తే ఆటోస్టే వేరు అంటున్నారు పలువురు. వేడివేడిగా ఉండే సూప్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని న్యూట్రీషన్లు చెబుతున్నారు. శరీరానికి తేలికగా జీర్ణమై సత్వరంగా శక్తిని అందించడంలో సూప్స్ దోహదం చేస్తాయి. అటు ఆరోగ్యపరంగా, ఇటు నోటికి తాకగానే రుచిగా ఉండే సూప్స్‌ను ఇప్పటివారు అమితంగా ఇష్టపడుతున్నారు. హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చిరువ్యాపారులు ఎన్నో వెరైటీల్లో సూప్స్ తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. చలికాలంలో చాలామంది నీరు తాగడం తగ్గిస్తారు. దీంతో శరీరంలో నీటినిల్వలు తగ్గుతుంటాయి. దీంతో జీవ ప్రక్రియలు సరిగా సాగక ఇన్‌ఫెక్షన్లు సోకుతాయి. ఇలాంటి సమయంలో వేడివేడిగా ఉండే సూప్‌లు ఎంతో మేలుచేస్తాయి. ఇవి తేలికగా అరగడమే కాకుండా ఒంటికి కావాల్సిన నీటిశాతాన్ని, పోషకాలను అందిస్తాయి.

ఉపయోగాలివే..

- భోజనానికి ముందు వెజిటెబుల్, నాన్‌వెజ్ సూప్ తీసుకుంటే తినే ఆహార పరిణామం తగ్గుతుంది. ఫలితంగా ఊబకాయులకు బరువు తగ్గే అవకాశం ఎక్కువ.
- సూప్‌ను నెమ్మదిగా చప్పరించడం, రుచి చూడటం, వాసన చూడటం, మింగడం వంటివి గొంతునొప్పిని తగ్గిస్తాయి.
- వివిధ కూరగాయల సూపుల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. కాలీఫ్లవర్ సూప్‌లో శరీరం సన్న బడేందుకు దోహదం చేస్తుంది.
- బీట్‌రూట్ సూప్ రక్తాన్ని శుద్ధిచేయగా.. బోన్ సూప్‌తో రోగ నిరోధక శక్తి పెరిగి, కీళ్లనొప్పులు తగ్గుతాయి.
- శరీరం తేలిగ్గా, శక్తిమంతంగా ఉండేందుకు సూప్‌లు ఉపయోగపడుతాయని నిపుణుల న్యూట్రీషన్స్ చెబుతున్నారు.

వెజ్, నాన్ వెజ్ సూప్స్



జిల్లా ఉన్నతాధికారులకు మా రెస్టారెంట్ నుంచి సూప్స్‌ను అందిస్తున్నాం. భోజన ప్రియుల్లో మెనూ విధానం మారింది. గతంలో బిర్యాని అడిగి తినేవారు. ఇప్పుడు ముందుగా వెరైటీ రుచుల్లో సూప్స్ తీసుకుంటున్నారు. కస్టమర్ల టేస్ట్‌కి తగ్గట్టుగా కొత్త కొత్త రుచుల్లో సూప్స్‌ను అందిస్తాం.

– మొట్టల మహేశ్, వేములవాడ, రెస్టారెంట్

ఆన్‌లైన్‌లో ఆర్డర్లు



కస్టమర్ల మెనూలో సూప్స్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంది. రెగ్యులర్‌గా హోటల్స్‌లో తినేవారు తప్పకుండా అడుగుతున్నారు. కస్టమర్లు ఇష్టపడే అన్ని ఫ్లేవర్స్‌లో సూప్స్ అందిస్తున్నాం. ఆన్‌లైన్ ఆర్డర్లలో కూడా సూప్స్ కోరుతున్నారు. హైదరాబాద్ వంటి నగరాలకు తీసిపోని రుచుల్లో సూప్స్‌ను అందిస్తాం.

– రాపెల్లి భాస్కర్, రెస్టారెంట్ నిర్వాహకుడు, సిరిసిల్ల

ఆరేళ్లుగా తయారు



ఆరేళ్లుగా గోపాల్‌నగర్‌లో వెజిటబుల్ సూప్స్ తయారు చేస్తూ..కస్టమర్లకు అందిస్తున్నా. వెజ్ హాట్, మాంచో సూప్స్‌కు కస్టమర్లు ఎక్కువగా ఉన్నారు. అన్ని వయస్సుల వారు సూప్స్ ఇష్టపడుతున్నారు. ముంబైలో చూసి సిరిసిల్లలో కొత్తగా సూప్స్ కొట్టు పెట్టాను.

– రంగుల క్రాంతికుమార్, చిరు వ్యాపారి

వెజిటబుల్ సూప్ తాగుతా



రోజూ ఈవినింగ్ స్నాక్స్‌కు బదులు వేడివేడిగా జింజర్ వెటిజేబుల్ సూప్ తాగుతా. మనం తాగే సూప్స్ శుభ్రంగా ఉండాలి. జీర్ణవ్యవస్థ మెరుగవడమే కాదు ఎముకలు ధృడమవుతాయి. చిక్కటి సూప్స్‌కోసం బియ్యం, మక్క జొన్న, ఓట్స్ పౌడర్, ప్రొటీన్ల స్థాయిని పెంచేందుకు పప్పులు, సిరిధాన్యాల పిండిని కలపొచ్చు.

– వెగ్గలం శ్రీనివాస్, సిరిసిల్ల

ముగిసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



ఎల్లారెడ్డిపేట: కోరుట్లపేటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో చిరంజీవి



గంభీరావుపేట: రాజుపేటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలనలో శనివారం నాటికి 17,100 దరఖాస్తులు చేసుకున్నారు. చివరి రోజు 2,000 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఎంపీడీవో చిరంజీవి మాట్లాడుతూ.. దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి డాటా ఎంట్రీ చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. తహసీల్దార్ రాంచంద్రం, అధికారులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: మండలంలోని 17 గ్రామాల నుంచి 7,983 ప్రజాపాలన దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో రాంరెడ్డి తెలిపారు.

వీర్నపల్లి : ప్రజాపాలన దరఖాస్తులు శనివారంతో ముగిసినట్లు ఎంపీడీవో నరేశ్ కుమార్ తెలిపారు. మండలం మొత్తం 4,147 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు.

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రజాపాలన గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేపనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మండలంలోని 22 గ్రామాల్లో ప్రజాపాలనలో ఇప్పటివరకు 5వేల 548 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో రమాదేవి తెలిపారు. జనవరి 17లోగా దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ చేసేందుకు ప్రణాళిక రూపొందించారన్నారు. రెవెన్యూ కార్యాలయంలో సర్వర్ డౌన్ ఉండడంతో సిబ్బంది ఖాళీగా ఉన్నారు.

బోయినపల్లి: మండలంలోని 23 గ్రామాలనుంచి 12,643 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి తెలిపారు. రేషన్‌కార్డులకోసం తదితర 2,200 దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులను 26 మంది సిబ్బంది డాటాఎంట్రీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గంభీరావుపేట: రాజుపేటలో ప్రజాపాలన నిర్వహించారు. గ్రామంలో దాదాపు 50 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ భూపతి, ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేక దర్శనం కల్పించాలి

సిరిసిల్ల: రాజన్న ఆలయంలో సీనియర్ సిటిజన్స్(వయోవృద్ధులు)కు ప్రత్యేక దర్శనం కల్పించాలని జిల్లా సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ శనివారం ఆలయ అధికారులకు వినతిపత్రం అందించారు. వయోవృద్ధులు క్యూలైన్లలో నిల్చునే పరిస్థితి ఉండదని, మోకాళ్ల నొప్పులు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతుంటారని వివరించారు. జిల్లా సంక్షేమాధికారి ద్వారా సీనియర్ సిటిజెన్స్‌కు గుర్తింపు కార్డులు జారీ అయ్యాయని, వాటిని పరిశీలించి ప్రత్యేక దర్శనం కల్పించాలని కోరారు. ఈమేరకు జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, ఉపాధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, కోశాధికారి దొంత దేవదాస్ ఆలయ అధికారులకు వినతిపత్రం అందించారు.

తల్లిచెంతకు తప్పిపోయిన బాలుడు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం సాయంత్రం తప్పిపోయిన బాలుడిని పోలీసులు తల్లి చెంతకు చేరవేశారు. మూడేళ్ల వయస్సు ఉన్న షేక్ అనీఫ్ అనే బాలుడు ఎల్లారెడ్డిపేటలోని అంబేద్కర్‌రోడ్డులో తప్పిపోయాడు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న హెల్పర్ సతీశ్ గమనించాడు. రోదిస్తున్న బాలుడిని పోలీసులకు అప్పగించారు. తప్పిపోయిన బాలుడి ఫొటోతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన సోషల్‌మీడియాలో వైరల్ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో తన కొడుకు ఉన్నట్లు తెలుసుకున్న బాలుడి తల్లి ఠాణాకు వెళ్లగా.. పోలీసులు తల్లికి అప్పగించారు. హెడ్‌కానిస్టేబల్ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ సతీశ్, రమేశ్ ఉన్నారు.



పీహెచ్‌సీలో తనిఖీ

వేములవాడరూరల్: వేములవాడ మండలం హన్మాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవల నిమిత్తం నాణ్యతా ప్రమాణాలు కొనసాగిస్తున్న విధానాన్ని నేషనల్ క్వాలిటీ అస్సూరెన్స్ స్టాండర్డ్ సభ్యులు శనివారం పరిశీలించారు. ఫార్మసీ ఓపీ, లేబర్ రూం, ఇన్‌పేషెంట్ వార్డు, దివ్యాంగుల, టీబీ ఉపకేంద్రాల రికార్డులను డా.నరేంద్రసింగ్, సచిన్ కుమార్ సాహూ పరిశీలించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ దివ్యాన్షి, డీపీవో ఉమ, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వధిస్తే చర్యలు

వేములవాడ: వన్యప్రాణులను వధిస్తే చర్యలు తప్పవని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి హెచ్చరించారు. తన ఆఫీస్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. రైతులు వ్యవసాయ పొలాల వద్ద, వేటగాళ్లు కరెంటు తీగలు అమర్చి వన్యప్రాణుల మృతికి కారకులవుతున్నారన్నారు. ఇటీవల కోనరావుపేట మండలం మరిమడ్ల, రుద్రంగి మండలం మానాల శివారుల్లో వన్యప్రాణులను వేటాడేందుకు ఏర్పాటు చేసిన కరెంటు తీగలకు ఇద్దరు బలైన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తామన్నారు.

విరాళం అందజేత

తంగళ్లపల్లి: మండలంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి జెడ్పీటీసీ పూర్మాని మంజుల రాంలింగా రెడ్డి దంపతులు రూ.11,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మంజుల మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మహిళలు



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన పలువురు మహిళలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ మహిళలు కాంగ్రెస్‌లో చేరడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆరు స్కీములలో మహిళలకే అధిక ప్రాధాన్యం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, నాయకులు లింగంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, బుచ్చాగౌడ్, చెన్ని బాబు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

తంగళ్లపల్లి: మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధిహామీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా నాయకుడు సోమ నాగరాజు కోరారు. మండలంలోని రాళ్లపేటలో ఉపాధిహామీ కూలీలతో శనివారం మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కొత్త వారికి జాబ్‌కార్డులు ఇవ్వాలని గడ్డపార, పార, తట్ట, నీళ్ల సౌకర్యం, మెడికల్‌కిట్టుతోపాటు పని స్థలంలో టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. బడ్జెట్ పెంచి 200 రోజుల పనిదినాలు కల్పించాలని బకాయిలు చెల్లించాలని అన్నారు. ఉపాధిహామీ కూలీలు రాజ మల్లయ్య, ఇలవేని నర్సయ్య, పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్ మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పట్టుకున్నామని ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపారు. రామలక్ష్మణపల్లి, ఆవునూర్, తుర్కపల్లి, కొండాపూర్ మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు



విరాళం ఇస్తున్న ఆది శ్రీనివాస్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా శనివారం ఆలయాన్ని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సందర్శించారు. స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఉపసర్పంచ్ తిరుపతి ఆదికి స్వామివారి లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం ఆది శ్రీనివాస్ ఆలయానికి రూ.5,116 విరాళం అందజేశారు. కేకే.మహేందర్ రెడ్డి, జెడ్పీటీసీ పూర్మాని మంజుల, వైద్య శివప్రసాద్, రాంలింగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తేనీటి విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

తంగళ్లపల్లి: వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం ప్రెస్‌క్లబ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు ఇచ్చిన తేనీటి విందులో పాల్గొన్నారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు దొంతుల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రంగు శ్యామ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే.మహేందర్ రెడ్డి, జెడ్పీటీసీ పూర్మాని మంజుల రెడ్డిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రెస్‌క్లబ్ సభ్యులు పిల్లి శ్రీనివాస్, అందె దేవేందర్, మోర శ్రీకాంత్, సామల గట్టు, పి.లింగారెడ్డి, యాదన్న, జలగం అనిల్ కుమార్, బర్ల బాలు, సిరిపాక ప్రణయ్, గ్యాదనవేని మధు, రెడ్డి రాజశేఖర్, రాజు, సాగర్, శ్రీధర్ రావు, మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ లింగం రాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరు

రుద్రంగి(వేములవాడ): మండలకేంద్రానికి చెందిన చింతలపెల్లి పెద్ద గంగారెడ్డి, సుశీల దంపతుల కుమార్తె వివాహ వేడుకకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, నాయకులు, తదితరులున్నారు.

అలరించిన ఫ్రెషర్స్‌డే..



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్లలో బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు అలరించాయి. అసోసియేట్ డీన్ డా.జి.శ్రీదేవి ఆధ్వర్యంలో వేడుకలు జరపగా సీనియర్ అధ్యాపకులు కుమారస్వామి, కనకదుర్గ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాములోరి అక్షింతలతో శోభాయాత్ర



ఎల్లారెడ్డిపేటలో అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



వేములవాడరూరల్: ఇంటింటా అక్షింతలు పంపిణీ చేస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలో అయోధ్య రాములవారి అక్షింతలతో గ్రామస్తులు శోభాయాత్ర నిర్వహించారు. శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామం ఇంటింటా అక్షింతలు పంపిణీ చేశారు. బండలింగంపల్లిలో శోభాయాత్ర నిర్వహించి ఇంటింటికీ పంపిణీ చేశారు. వేద పండితులు నవీన్‌చారి, శ్రీనివాసచారి, సత్సంగ సదనం ప్రతినిధులు లక్ష్మమ్మ, నాగేంద్రం, లక్ష్మీనారాయణ, రవీందర్, రాము, ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, రమేశ్, భాస్కర్, నంది కిషన్, తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని తడగొండ, బూర్గుపల్లి గ్రామాల్లో అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర శనివారం నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆయాగ్రామాలకు చెందిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: మండలంలోని పోచెట్టిపల్లిలో శనివారం అయోధ్య శ్రీరాముడి అక్షింతలను ఇంటింటా అందించారు. కార్యక్రమంలో మల్లేశం, గోపు ప్రవీణ్‌కుమార్, శేఖర్, సాగర్ల నరేశ్, సుంక అంజయ్య, నరేందర్, జనార్దన్, మల్లేశం, సంజీవ్, రమేశ్, అంజయ్య, రమేశ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని నాగారం, మంగళ్లపల్లి గ్రామాల్లో అయోధ్య రాముడి అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. సర్పంచ్ బాస లావణ్య, బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్ రావు, సింగిల్‌విండో డైరెక్టర్ జ్యోతి, మాజీ వైస్‌ఎంపీపీ తీగల రవీందర్‌గౌడ్, నాయకులు భాస్కర్‌రావు, రామచంద్రం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలో శ్రీ కల్యాణ సీతారాచంద్రస్వామి అలయం చైర్మన్ గడ్డం దేవయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం హనుమాన్ ఆలయంలో గ్రామ కులపెద్దలకు అయోధ్య అక్షింతలు అందజేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని కులపెద్దలు ఇంటింటికీ పంపిణీ చేశారు. సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.



బోయినపల్లి: తడగొండలో అక్షితల శోభాయాత్ర

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలకేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్ ఖండ ఇన్‌చార్జి గూడెపు దేవేందర్ ఆధ్వర్యంలో అయోధ్య రాముడి అక్షింతలను ఇంటింటికీ అందజేశారు. మైనార్టీ నాయకుడు మహ్మద్ సర్వర్‌కు అయోధ్య అక్షింతలు అందజేసినట్లు దేవేందర్ పేర్కొన్నారు. భవ్య రామమందిర అక్షింతలు ఇంటింటికీ చేరుతుండగా ముస్లిం కుటుంబాల కోరిక మేరకు వారికి ఇచ్చినట్లు తెలిపారు.

తంగళ్లపల్లి: అయోధ్య రాముడి అక్షింతలతో సారంపల్లిలో శోభాయాత్ర నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామస్తులకు పంపిణీ చేశారు. సర్పంచ్ రమేశ్, అంజయ్య, రాజు, భరత్ గౌడ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలకేంద్రంలో ఇంటింటికీ రాములోరి అక్షింతలను పంపిణీ చేశారు. రామ భక్తులు మేళతాళాలతో ఇంటింటికీ వెళ్లి అక్షింతలు పంపిణీ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక హైస్కూల్‌లో శనివారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస దీక్షిత్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, నోడల్ అధికారి, కే.రామారావు, టీపీయూఎస్ రాష్ట్ర కార్యదర్శి వీ.జగన్‌మోహన్, మండల బాధ్యులు తిరుపతి, రవికుమార్, సురేందర్ స్వామి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అతకుముందు ఎంఈవో ఆధ్వర్యంలో స్కూల్ కాంప్లెక్స్ ఉన్నతి సమావేశం నిర్వహించారు.

పెండింగ్ చలాన్లు చెల్లించాలి

ముస్తాబాద్: వాహనదారులు పెండింగ్ చలాన్లు చెల్లించి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై శేఖర్‌రెడ్డి కోరారు. కార్లు, ద్విచక్ర వాహనాలపై ఉన్న జరిమానాలను వెంటనే చెల్లించాలన్నారు. ద్విచక్రవాహనాలు, ఆటోలపై చలాన్లలో 20 శాతం, కార్లు ఇతర వాహనాలపై 40 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. అవకాశాన్ని వాహనదారులు సద్వి ని యోగం చేసుకోవాలన్నారు. బైక్‌లు, ఆటోలపై ఉ న్న చలాన్లలో 80 శాతం రాయితీ ఉందని, కార్లు, ఇతర పెద్ద వాహనాలపై 60 శాతం రాయితీని ప్ర భుత్వం కల్పించిందని, గడువులోగా చెల్లించాలని కోరారు.

కమిటీ ఎన్నిక

గంభీరావుపేట(సిరిసిల్ల): శివసేన పార్టీ కోర్ కమిటీ సభ్యుడిగా మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన గౌటే గణేశ్ నియామకమయ్యారు. సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, కామారెడ్డి, జగిత్యాల జిల్లాల ఇన్‌చార్జిగా నియమించారు. తన నియామకానికి సహకరించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.